

కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జిగా త్రినాథరావు

శ్రీకాకుళం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఇన్‌చార్జిగా గాదం వెంకట త్రినాథరావు నియమితులయ్యారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు ఇన్‌చార్జిలను నియమిస్తూ.. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళారెడ్డి ఉత్తర్వులను విడుదల చేశారు. ఇందులో భాగంగా విశాఖపట్నానికి చెందిన గాదం వెంకట త్రినాథరావును శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జిగా నియమించారు. ఈయన ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగానూ వ్యవహరిస్తున్నారు.

పల్లెల్లో పాల వెల్లువ

- పాడి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం
- పశువుల పెంపకానికి రైతుల ఆసక్తి
- జిల్లాలో పెరిగిన పాల ఉత్పత్తి
- గతం కంటే రెండు లక్షలు లీటర్లు అధికం



● మెళియాపుట్టి మండలం జంతూరు గ్రామానికి చెందిన **నెయ్యల సింహాచలం** అనే రైతుకు రెండు ఆవులు ఉన్నాయి. ఈ ఆవులు ప్రతి రోజూ రెండు పూటలా 10 లీటర్ల చొప్పున పాలు ఇస్తున్నాయి. గతంలో ఈ పాలను డెయిరీకి ఇవ్వగా లీటర్ ధర రూ.30 పలికేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ ధర పెరిగింది. ప్రస్తుతం సింహాచలం లీటర్ పాలను వెన్నశాతం బట్టి రూ.40 నుంచి రూ.45 వరకు విక్రయిస్తున్నాడు. ప్రతిరోజూ రూ.800 వరకు ఆదాయం వస్తుంది. దీంతో పొలం పనులతో పాటు పాడిపెంపకం ద్వారా మంచి లాభాలు వస్తున్నాయని చెబుతున్నాడు.



● మెళియాపుట్టి మండలం జంతూరు గ్రామానికి చెందిన **బందపల్లి గవిరేష్‌**కు గతంలో మూడు ఆవులు ఉండేవి. గత వైసీపీ ప్రభుత్వం పాడి అభివృద్ధికి ఎటువంటి నిధులు ఇవ్వలేదు. పైగా పాల ధరలు తక్కువగా ఉండేవి. దీంతో గవిరేష్ తన మూడు ఆవులను అమ్మేశాడు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మినీ గోకులాల నిర్మాణానికి నిధులు ఇవ్వడంతో పాటు పాలు రేట్లు బాగున్నాయి. దీంతో ఆవుల పెంపకానికి గవిరేష్ ఆసక్తి చూపిస్తున్నాడు.

(మెళియాపుట్టి)

గత వైసీపీ ప్రభుత్వం పాడి పరిశ్రమను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల పాటు ఎలాంటి ప్రోత్సాహకాలు అందించలేదు. పైగా పాల ధరలు తక్కువగా ఉండేవి. దీంతో పాడి పెంపకానికి రైతులు ఆసక్తి చూపించేవారు కాదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపడుతోంది. మినీ గోకులాల నిర్మాణానికి, పశుగ్రాసం పెంపకానికి నిధులు మంజూరు చేస్తోంది. పాల ధరలు కూడా పెరగడంతో జిల్లాలోని రైతులు పాడి పెంపకంపై ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లాలో 60 శాతం రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని 798 పశుకేంద్రాల పరిధిలో ఆవులు 4,56,291, గేదెలు 40,477, గొర్రెలు 6,23,641, మేకలు 2,77,268 ఉన్నట్లు గణంకాలు చెబుతున్నాయి. గతంలో ప్రతిరోజూ సుమారు 8 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి జరిగేది. అయితే, గత మూడు నెలల నుంచి 10 లక్షల లీటర్ల ఉత్పత్తి జరుగుతున్నట్లు పశుసంవర్థక శాఖ అధికారులు చెబుతున్నారు.



దాణా కొనుగోలు కోసం ఏటీఎం కార్డులు అందజేస్తున్న పాలసేకరణ ఏజెన్సీలు

పాడి పరిశ్రమకు పూర్వవైభవం

పాడిరైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం 2018లో మినీ గోకులాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. షెడ్ల నిర్మాణానికి పాడిరైతులకు రాయితీపై నిధులు మంజూరు చేసింది. దీంతో జిల్లాలో చాలామంది రైతులు గోకులాల షెడ్లను నిర్మించుకున్నారు. అయితే, 2019లో అధికారంలోకి వైసీపీ ప్రభుత్వం మినీ గోకులాల పథకాన్ని నీరు గార్చింది. ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు. అంతేకాకుండా అప్పటికే షెడ్లు నిర్మించుకున్న రైతులకు బిల్లులు కూడా ఇవ్వలేదు. గత మూడున్నరేళ్ల పాటు జిల్లాకు చెందిన సీదిరి అప్పలరాజు పశుసంవర్థక శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ పాడిపరిశ్రమ అభివృద్ధికి రూపాయి కూడా కేటాయించలేదు. పైగా రైతులు అమూల్ కంపెనీకి మాత్రమే పాలు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. మృతి చెందిన పశువులకు సంబంధించి రైతులకు బీమా కూడా అందించేవారు కాదు. దీంతో చాలామంది రైతులు తమ పాడి సంపదను అమ్మేశారు. ఫలితంగా జిల్లాలో పాల దిగుబడి పడిపోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాడి పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తోంది. దీనిలో భాగంగా మినీ గోకులాల పథకాన్ని పునరుద్ధరించేందుకు పచ్చజెండా ఊపింది. పశుసంవర్థక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలతో జిల్లాలో అధికంగా 1,050 మినీ గోకులాల నిర్మాణానికి, పశుగ్రాసం పెంపకానికి నిధులు మంజూరు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. పశు పోషకులకు 90 శాతం, కోళ్లు, మేకలు, గొర్రెల పెంపకందారులకు 70 శాతం రాయితీపై షెడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఉపాధిహామీ పథకం నుంచి నిధుల కేటాయించడంతో బిల్లుల మంజూరుకు ఇబ్బంది ఉండదనే ఉద్దేశంతో షెడ్ల నిర్మాణానికి రైతులు ముందుకు వస్తున్నారు. అలాగే, దాణా, గ్రాసం కొనుగోలు కోసం పాల సేకరణ ఏజెన్సీలు రైతులకు ఏటీఎం కార్డులు ఇస్తున్నాయి. దీంతో గతంలో పోషణ భారమై అమ్మేసిన ఆవులు, గేదెలను మళ్లీ కొనుగోలు చేసి పెంచుతున్నారు. ఫలితంగా జిల్లాలో పాల ఉత్పత్తి గతం కంటే రెండు లక్షల లీటర్లు పెరిగింది. మొత్తం 10 లక్షల లీటర్ల ఉత్పత్తికి గాను జిల్లా అవసరాలకు సుమారు 6.75లక్షల లీటర్లు పోను మిగిలిన 3.25 లక్షల లీటర్ల పాలను ఇతర జిల్లాలకు ఎగుమతి చేసుకునే స్థాయి పాడిపరిశ్రమ ఎదగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బందపల్లిలో పాలు సేకరిస్తున్న దృశ్యం

పాల ఉత్పత్తి పెరుగుతుంది..

గతంలో మా కేంద్రం నుంచి ప్రతిరోజూ 100 లీటర్ల పాలు డైయిరీకి పంపితే ప్రస్తుతం 150 లీటర్లు పంపుతున్నాం. రైతులు పాడి పెంపకానికి ఆసక్తి చూపిస్తుండడంతో పాల ఉత్పత్తి పెరుగుతుంది.

-నందో, పాలసేకరణ యజమాని, బందపల్లి, మెళియాపుట్టి

రాష్ట్రాన్ని వంద రోజుల్లో గాడిలో పెట్టాం

- అంచెలంచెలుగా హామీల అమలు
- అన్ని వర్గాలకూ సమన్యాయం
- మంత్రి అచ్చెన్నాయుడు


కోటబొమ్మాళి, సెప్టెంబరు 22: 'వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పై పెట్టారు. వ్యవస్థలన్నీ నాశనం చేశారు. కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో ఆ వ్యవస్థలన్నీ గాడిలో పెట్టాం. గడ్డు పరిస్థితుల్లోనూ ఇచ్చిన హామీలన్నీ అంచెలంచెలుగా నేరవేర్చుతున్నామ'ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం కోటబొమ్మాళి మండలం కొత్తపల్లిలో ఆయన పర్యటించారు. గ్రామస్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు. రూ.12లక్షల కోట్ల అప్పులే మిగిల్చారు. ప్రస్తుతం వాటికి ఏటాకు రూ.20 వేల కోట్ల వరకూ వడ్డీ చెల్లించాల్సి ఉంది. ఆర్థికవ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే విపత్తులు తోడయ్యాయి. అవాంతరాలను అధిగమిస్తూ.. అభివృద్ధి దిశగా అడుగులేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి కొంతమేర ఊరట లభిస్తోంది. ధాన్యం కొనుగోలు బిల్లు రూ.1600కోట్లు పెండింగ్ ఉండగా.. ఇటీవల వాటిని విడుదల చేశాం. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశాం. గ్రామాల అభివృద్ధి కోసం పంచాయతీలకు రూ.2500కోట్లు నిధులు మంజూరు చేశాం. ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టి.. సాగునీరు అందించామ'ని తెలిపారు. 'వైసీపీ పాలనలో డ్వాక్రా సంఘాల పేరిట రూ.కోట్లు కొల్లగొట్టారు. వలంటీర్లకు గతేడాది ఆగస్టులోనే గడువు ముగియగా.. రెన్యువల్ చేయలేదు. ఎన్నికల ముందు బలవంతపు రాజీనామాల డ్రామాలు ఆడి వారికి ద్రోహం చేశారు. ఇకపై అన్ని వర్గాలకూ సమన్యాయం చేస్తాం. సంక్రాంతి లోపల రైతుల ఖాతాల్లో పెట్టుబడి సొమ్ము జమ చేస్తాం. డ్వాక్రా సంఘాలకు సున్నా వడ్డీలకు రుణాలు అందజేస్తాం. ఇంటింటికీ తాగునీటి సరఫరాకు చర్యలు చేపడతాం. శిథిలమైన పాకివలస, సరియాపల్లి వంతెనలను నిర్మిస్తాం. దీపావళికి ఉచిత గ్యాస్ సిలెండర్లు అందజేస్తాం. గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామ'ని మంత్రి అచ్చెన్న భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో సుదర్శన దొర, మండల ప్రత్యేక అధికారి గడ్డెమ్మ, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, టీడీపీ నేతలు శిమ్మ సింహాచలం, కోరాడ సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీపీలు వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, వెలమల కామేశ్వరరావు, కర్రి అప్పారావు, నంబాళ రాజశేఖర్, నౌపాడ రామారావు, దుబ్బ శివాజీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

వైద్యారోగ్య శాఖలో వసూళ్ల కలకలం

- ఉద్యోగాల పేరిట కాంట్రాక్టు ఉద్యోగి చేతివాటం
- నకిలీ నియామక పత్రాలతో మోసం
- మహిళ ఆత్మహత్యాయత్నం ఘటనతో బయటపడుతున్న అక్రమాలు



(శ్రీకాకుళం క్రైం/అరసవల్లి)

జిల్లా వైద్యారోగ్యశాఖలో ఉద్యోగాల పేరిట వసూళ్ల పర్వం ఒక్కొక్కటీ బయటపడుతున్నాయి. డేటాఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం కోసం ఆ శాఖలో పనిచేస్తున్న ఓ కాంట్రాక్ట్ ఉద్యోగిని కలిసి మోసపోయిన ఓ మహిళ.. ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో పలువురు తాము బాధితుల మేనంటూ బయటకు వస్తున్నారు. ఉద్యోగాల కోసం రూ.లక్షల్లో ముట్టజెప్పి మోసపోయామని లబోదిబోమంటున్నారు. డీఎంహెచ్‌వోను కలిసి తమకు న్యాయం చేయాలంటూ వేడుకున్నారు. వివరాల్లోకి వెళితే..

జిల్లా వైద్యరోగ్యశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గుజ్జల నరసింహం అక్రమాలు బయటపడుతున్నాయి. ఉద్యోగాలు ఇప్పిస్తామని, అంతా తానేనని నమ్మబలికి నిరుద్యోగుల నుంచి ఆయన రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీకాకుళం నగరం కంపోస్టు కాలనీకి చెందిన ఓ మహిళ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసేది. రెండేళ్ల కిందట ఆమెకు వైద్యశాఖలోని డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఉద్యోగం కల్పిస్తామని కాంట్రాక్ట్ ఉద్యోగి నరసింహం నమ్మించాడు. ఈ మేరకు డబ్బులు ఖర్చవుతాయని చెప్పి.. విడతల వారీగా రూ.4లక్షల వరకూ వసూలు చేశాడు. అంతటితో ఆగకుండా.. ఇటు ప్రభుత్వాన్ని, అటు వైద్యశాఖను మోసం చేసి.. నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు సృష్టించాడు. కొన్నాళ్ల కిందట వాటిని ఆ మహిళకు అందజేశాడు. ఆ నియామక పత్రాన్ని తీసుకెళితే తమ అక్ర మాలు బయటపడతాయనే ఉద్దేశంతో.. ఉద్యోగం చేయకుండానే 5 నెలలపాటు ఆమెను మభ్యపెట్టాడు. ప్రతినెలా ఆమె బ్యాంకు ఖాతాలో రూ. 18,500 జీతం రూపంలో జమ చేశాడు. అయితే ఉద్యోగానికి వెళ్లకుండానే జీతం రావడంతో ఆ మహిళకు అనుమానం వచ్చింది. దీంతో ఆ నియామక పత్రాన్ని తీసుకెళ్లి.. జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి బి.మీనాక్షి కలువగా.. నకిలీ విషయం వెలుగులోకి వచ్చింది. తాను మోసపోయానని ఆ మహిళ గుర్తించింది. నమ్మించి మోసం చేసిన నరసింహను ఆమె నిలదీయడంతో వివాదం చోటుచేసుకుంది. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తనకు న్యాయం చేయాలంటూ బాధితురాలు వన్‌టౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆదివారం కాంట్రాక్ట్ ఉద్యోగి నరసింహంపై చీటింగ్, బెదిరింపు, అవమానం సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని వన్‌టౌన్ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ తెలి పారు. ఆయనపై ఉన్న పాత కేసులు కూడా పరిశీలిస్తున్నామని, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

● **బాధితులు కోకొల్లలు**

ఇటీవల వైద్యారోగ్యశాఖలో నియామకాల్లో సైతం కాంట్రాక్ట్ ఉద్యోగి నరసింహం చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ శాఖలోని ఓ హెల్త్ అసిస్టెంట్ నియామకం విషయంలో రూ.5లక్షల వరకూ వసూలు చేశారని తెలుస్తోంది. పీఎన్ కాలనీ సమీపంలో ఓ వ్యక్తి వద్ద కూడా ఉద్యోగం నిమిత్తం రూ.2.50 లక్షల వరకూ డిమాండ్ చేయగా.. రూ.50 వేలు ఇచ్చినట్టు బాధితులు చెబుతున్నారు. అలాగే ఆరు నెలల కిందట ఇద్దరు మహిళలు.. నియామకపత్రాలు తీసుకుని వైద్యారోగ్యశాఖలో ఉద్యోగంలో చేరేందుకు డీఎంహెచ్‌వోను కలిశారు. ఆమె అవి నకిలీ ఆర్డర్ కాపీలు అని చెప్పడంతో వారు మోసపోయామంటూ లబోదిబోమన్నారు. ఇటువంటి ఉదంతాలు 2020 నుంచీ జరుగుతునే ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు.

● **విచారణకు ఆదేశించాం**

జిల్లా వైద్యారోగ్యశాఖలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని, ఓ మహిళ నుంచి రూ.4లక్షలు వసూళ్లకు పాల్పడి, నకిలీ ఉద్యోగ నియామక పత్రాన్ని ఇవ్వడంపై కాంట్రాక్టు హెల్త్‌అసిస్టెంట్ గుజ్జల నరసింహంపై ఫిర్యాదు అందింది. ఆయనపై వచ్చిన ఆరోపణలపై విచారణకు ఆదేశించాం. 2020 సంవత్సరం నుంచి ఇటువంటి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. మహిళతో పాటు మరి కొంతమంది బాధితులు మోసపోయామని ఆశ్రయిస్తున్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, కలెక్టర్‌కు నివేదిస్తాం.

- డాక్టర్ బి.మీనాక్షి, డీఎంహెచ్‌వో, శ్రీకాకుళం

కొత్త అధికారులు వస్తున్నారు

- జిల్లాలో బదిలీలు, పదోన్నతుల సందడి
- పీఆర్ ఎస్‌ఈగా నిషాంత్ హుస్సేన్

శ్రీకాకుళం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల్లో బదిలీలు, పదోన్నతుల సందడి నెలకొంది. ఈక్రమంలో జిల్లాకు కొత్త అధికారులు వస్తున్నారు. పలువురు అధికారులను నియమిస్తూ.. ఆదివారం పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు జిల్లా పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్‌ఈ)గా మహ్మద్ నిషాంత్ హుస్సేన్ నియమితులయ్యారు. ఈయన విజయవాడలో ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అక్కడ నుంచి పదోన్నతిపై పీఆర్ ఎస్‌ఈగా జిల్లాకు రానున్నారు. అక్టోబర్ 1న ఇక్కడ విధుల్లో చేరనున్నారు.


● **డీపీవోగా భారతీ సౌజన్య**

జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో)గా కె.భారతీ సౌజన్య నియమితులయ్యారు. ఈమె కాకినాడ జిల్లా పంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ నుంచి బదిలీపై జిల్లాకు వస్తున్నారు. ప్రస్తుత డీపీవో టి.వెంకటేశ్వరరావును విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. అలాగే జిల్లా నీటియాజమాన్య సంస్థ(డ్వామా)లో జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజును అల్లూరి సీతారామరాజు జిల్లా గ్రామ పంచాయతీ అధికారిగా బదిలీ చేశారు.

● **జడ్పీ సీఈవోగా ఎల్‌ఎన్‌వీ శ్రీధర్ రాజా**

జిల్లాపరిషత్ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి(సీ ఈవో)గా ఎల్‌ఎన్‌వీ శ్రీధర్ రాజా నియమితులయ్యారు. ఈయన విజయనగరం జిల్లాపంచాయతీ అధికారిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వస్తున్నారు. అలాగే జడ్పీ ఉప ముఖ్య కార్యనిర్వాహణ అధికారి(డిప్యూటీ సీఈవో)గా డి.సత్యనారాయణ నియమితులయ్యారు. ఈయన విశాఖ జిల్లా పరిషత్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గాను, డీఎల్‌డీవోగానూ విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రస్తుత శ్రీకాకుళం జడ్పీ డిప్యూటీ సీఈవో ఆర్.వెంకటరామన్‌ను విజయనగరం జడ్పీ డిప్యూటీ సీఈవోగా నియమించారు.

● జిల్లా నీటియాజమాన్య సంస్థ పరిపాలన అధికారి (ఏవో) డా. డీవీ విద్యాసాగర్‌ను అనకాపల్లి డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అలాగే జిల్లాలో సివిల్ సప్లయిస్ అకౌంట్స్ విభాగం ఏఎం పి.శ్రీనివాసరావును మన్యం జిల్లాకు బదిలీ చేశారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థలో ప్రజారోగ్య విభాగ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుగుణాకరరావును విశాఖ సబ్ డివిజన్‌కు బదిలీ చేశారు. నగరపాలక సంస్థ మునిసిపల్ ఇంజనీర్ గంగాధర్ గ్రేటర్ విశాఖకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో విజయనగరం మునిసిపల్ ఇంజనీర్ దక్షిణామూర్తిని శ్రీకాకుళం ఎంఈగా నియమించారు.



శ్రీకాకుళంలో పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

ప్రశాంతంగా 'ఎర్రన్న విద్యా సంకల్పం' గ్రూప్-2 మాక్‌టెస్ట్

అరసవల్లి/ టెక్కలి, సెప్టెంబరు 22: ఎర్రన్న విద్యా సంకల్పం పేరిట నిర్వహించిన గ్రూప్-2 మాక్ టెస్ట్ ప్రశాంతంగా ముగిసింది. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులను ప్రోత్సహించేందుకుగాను కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు.. రెండేళ్ల కిందట 'ఎర్రన్న విద్యా సంకల్పం' ప్రారంభించారు. దీని ద్వారా వివిధ పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇస్తున్నారు. అభ్యర్థుల సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు ఎప్పటికప్పుడు మాక్‌టెస్టులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం శ్రీకాకుళం, పలాస, టెక్కలిలో నిర్వహించిన గ్రూప్-2 మెయిన్స్ మాక్ పరీక్షకు 250 మంది అభ్యర్థులు హాజరయ్యారు. బోధన, పరీక్షల నిర్వహణలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి సహకారం అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సూచించారు.



ఆనందాశ్రమంలో ప్రాయశ్చిత హోమం

వైసీపీ ప్రభుత్వ హయాంలో కలియుగ దైవం తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి కలిపి.. అపవిత్రం చేశారని రాష్ట్ర సాధుపరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆదివారం పొందూరు మండలం కృష్ణాపురంలోని ఆనందాశ్రమంలో ప్రాయశ్చిత హోమం నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని అపవిత్రం చేసినవారికి శిక్ష తప్పదని స్వామి శ్రీనివాసానంద తెలిపారు.

- పొందూరు

ఈ వారం మరో 11 ఐపీఓలు

» 14 కంపెనీల షేర్ల లిస్టింగ్

ముంబై: ఈ వారం కూడా పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మార్కెట్ సందడిగా ఉండనుంది. దాదాపు రూ.900 కోట్ల సమీకరణ కోసం 11 కంపెనీలు ఐపీఓకు వస్తున్నాయి. ఇందులో మన్‌బా ఫైనాన్స్ కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజిరేషన్ అనే రెండు కంపెనీల ఐపీఓలు మాత్రమే మెయిన్‌బోర్డు కంపెనీల ఐపీఓలు. మిగతా తొమ్మిది ఎస్ఎంఈ కంపెనీలు. వీటికి తోడు ఈ వారం 14 కంపెనీల ఐపీఓల షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్ట్ కానున్నాయి.

లీలా ప్యాలెస్ నుంచి రూ.5,000 కోట్ల ఐపీఓ

మరోవైపు లీలా ప్యాలెసెస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ మాతృసంస్థ స్క్లోస్ బెంగళూరు లిమిటెడ్ కూడా రూ.5,000 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతోంది. ఇందు కోసం ఆదివారం సెబీకి దరఖాస్తు సమర్పించింది. సెబీ ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకపోతే దేశ హాస్పిటాలిటీ చరిత్రలో ఇదే అతిపెద్ద ఐపీఓ కానుంది. రూ.5,000 కోట్ల ఐపీఓలో రూ.2,000 కోట్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా, మిగతా రూ.3,000 కోట్లు కొత్త ఈక్విటీ షేర్ల జారీ ద్వారా సమీకరిస్తారు.

కాగా సోలార్ ఎనర్జీ సొల్యూషన్స్ అందించే సోలార్91 క్లీన్‌టెక్ అనే ఎస్ఎంఈ కంపెనీ కూడా ఐపీఓకు సిద్ధమైంది. ఐపీఓ ద్వారా రూ.100 కోట్లు సమీకరించేందుకు సెబీకి దరఖాస్తు చేసింది.

పండగల సీజన్‌పై

లగ్జరీ కార్ల కంపెనీల భారీ ఆశలు

ఈ ఏడాది 50,000కు పైగానే విక్రయాలు



న్యూఢిల్లీ: పండగల సీజన్ దగ్గర పడుతోంది. దీంతో కార్ల కంపెనీలు ముఖ్యంగా మెర్సిడెజ్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడి వంటి లగ్జరీ కార్ల తయారీ కంపెనీలు.. అమ్మకాలపై భారీగా ఆశలు పెట్టుకున్నాయి. ఇందుకోసం ఇప్పటికే మార్కెట్లో ఉన్న పాపులర్ మోడల్స్‌తో పాటు మరిన్ని కొత్త మోడల్స్ మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. కొన్ని కంపెనీలు ఇప్పటికే కొన్ని లగ్జరీ మోడల్స్‌ను మార్కెట్లోకి విడుదల చేశాయి. మరికొన్ని కంపెనీలు వచ్చే వారం, పది రోజుల్లో మార్కెట్లోకి విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే పండగల సీజన్ ప్రత్యేక ఆఫర్లు మరో ఎత్తు. లగ్జరీ కార్ల కంపెనీలతో పాటు డీలర్లు కూడా తమవైన మరిన్ని ఆఫర్లు జోడిస్తున్నారు. దీంతో ఈ ఫెస్టివల్ సీజన్‌లో దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాల వృద్ధి రేటు రెండంకెల్లో ఉంటుందని ఆశిస్తున్నట్టు మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ చెప్పారు.

'ఈవీ'ల జోష్

వ్యాపారంలో 'ట్రెండ్ ఈజ్ మై బెస్ట్ ఫ్రెండ్' అంటారు. లగ్జరీ కార్ల కంపెనీలూ ఈ మాటను బాగా వంట పట్టించుకున్నాయి. ఇందులో భాగంగా రెండు ప్రధాన నగరాల మధ్య ప్రయాణించేందుకు వీలుగా హైఎండ్ లగ్జరీ ఈవీలను మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయి. మెర్సిడెజ్ బెంజ్ ఇప్పటికే తన మేబాక్ సిరీస్‌లో రెండు హైఎండ్ ఈవీలను విడుదల చేసింది. ఒకసారి చార్జింగ్ చేస్తే తమ ఈవీల్లో 600 నుంచి 800 కిలోమీటర్ల వరకు రీచార్జి అవసరం లేకుండా ప్రయాణించవచ్చని కంపెనీ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ చెప్పారు. ఈవీలపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పన్ను రాయితీలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. ఇవన్నీ ఈ ఫెస్టివల్ సీజన్‌లో దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాలకు బాగా కలిసొస్తుందని ఆశిస్తున్నట్టు ఆడి ఇండియా చీఫ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు.

జోరుగా అమ్మకాలు

గత ఏడాది మన దేశంలో 40 లక్షలకు పైగా కార్లు అమ్ముడయ్యాయి. అందులో లగ్జరీ కార్ల అమ్మకాలు రెండు శాతం కూడా లేవు. ఈ ఏడాది మాత్రం ఈ అమ్మకాలు 50,000 నుంచి 51,000 మధ్య ఉండే అవకాశం ఉందని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ సంతోష్ అయ్యర్ చెప్పారు. హై ఎండ్ కార్లపై ప్రస్తుతం 28 శాతం జీఎస్‌టీకి తోడు మరో 20 శాతం సెస్ విధిస్తున్నారు. ఇది చాలదన్నట్టు రాష్ట్ర ప్రభుత్వాలు జీరో నుంచి 20 శాతం వరకు రోడ్ ట్యాక్స్ విధిస్తున్నాయి. ప్రభుత్వాలు ఈ పన్నులను హేతుబద్ధం చేస్తే దేశంలో లగ్జరీ కార్ల అమ్మకాలు మరింత జోరందుకుంటాయని కంపెనీలు చెబుతున్నాయి.

నోకియా, ఎరిక్సన్, సామ్‌సంగ్‌లకు వొడాఫోన్ ఐడియా 30,000 కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ: పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో ఉన్న వొడాఫోన్ ఐడియా మరోసారి భారత టెలికాం మార్కెట్లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అవుతోంది. ఇందుకు పెద్దఎత్తున తన 4జీ సేవలను విస్తరించడంతో పాటు 5జీ సేవల ప్రారంభానికీ సిద్ధమవుతోంది. ఇందుకు అవసరమైన నెట్‌వర్క్ యంత్రపరికరాల కొనుగోలు కోసం నోకియా, ఎరిక్సన్, సామ్‌సంగ్ కంపెనీలకు 360 కోట్ల డాలర్ల (సుమారు రూ.30,000 కోట్లు) విలువైన కాంట్రాక్టు ఇచ్చింది. ఈ కంపెనీలు ఈ పరికరాల సరఫరా వచ్చే నెల నుంచే ప్రారంభిస్తాయి. 4జీ, 5జీ టెలికాం సేవల ద్వారా రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ కంపెనీలతో దీటుగా పోటీపడవచ్చని వొడాఫోన్ ఐడియా భావిస్తోంది.

★ మారుతి సుజుకీ.. వ్యాగన్ఆర్ వాల్ట్జ్ లిమిటెడ్ ఎడిషన్‌ను తీసుకువచ్చింది. ఈ లిమిటెడ్ ఎడిషన్‌లో ప్రత్యేకమైన స్టైలింగ్, కొత్త ఫీచర్లను చేర్చింది. ఎల్ఎక్స్ఐ, వీఎక్స్ఐ, జెడ్ఎక్స్ఐ వేరియంట్స్‌లో వ్యాగన్ఆర్ వాల్ట్జ్ అందుబాటులో ఉండనుంది. 1లీటర్, 1.2 లీటర్ అడ్వాన్స్‌డ్ కే-సిరీస్ ఇంజన్‌తో అందుబాటులో ఉండనున్న ఈ కారు ధరలు రూ.5.64 లక్షలు- రూ.6.71 లక్షల (ఎక్స్‌షోరూమ్) మధ్యన ఉన్నాయి.

★ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ రెండు కొత్త క్రెడిట్ కార్డ్స్‌ను తీసుకువచ్చింది. మయూర, అశ్వ పేర్లతో ఈ కార్డులను అందుబాటులోకి తెచ్చింది. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా మయూర కార్డును డిజైన్ చేయగా ఆధునిక జీవనశైలికి అనుగుణంగా అశ్వ కార్డును రూపొందించింది.

★ బజాజ్ ఫిన్‌సర్వ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ ప్రారంభించిన ఏడాది కాలంలోనే రూ.3,500 కోట్ల ఏయూఎం (ఆస్తుల నిర్వహణ)ను అధిగమించిందని బజాజ్ ఫిన్‌సర్వ్ మ్యూచువల్ ఫండ్ వెల్లడించింది. ఇప్పటికే ఈ ఫండ్ రెగ్యులర్ ప్లాన్ 41.30 శాతం, డైరెక్ట్ ప్లాన్ 43.43 శాతం రిటర్నులు అందించిందని తెలిపింది.

26,100 పైన బుల్లిష్

(సెప్టెంబరు 23-27 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో గైడ్

నిఫ్టీ గత వారం 25,849-25,336 పాయింట్ల మధ్యన కదలాడి 434 పాయింట్ల లాభంతో 25,791 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 26,100 పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

❒ 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,530, 25,418, 25,238, 25,030 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 26,100 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 25,300

నిరోధ స్థాయిలు: 26,000, 26,100, 26,200 (25,900 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 25,600, 25,500, 25,400 (25,700 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	555
వరంగల్	527	గోదావరి	550
చిత్తూరు	553	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	116
వరంగల్	120	గుంటూరు	119
కరీంనగర్	120	ఒంగోలు	119
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	113
కర్నూలు	120	నెల్లూరు	113
విశాఖపట్నం	105	అనంతపురం	113
గోదావరి	116		

లాభాల స్వీకరణకు చాన్స్!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లకు లోనయ్యే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ సంకేతాలు, యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల కోతతో మార్కెట్లలో ఊపు కనిపిస్తోంది. సూచీలు ఇప్పటికే గరిష్ఠాలకు చేరటంతో ఇన్వెస్టర్లు ఏ క్షణమైనా లాభాల స్వీకరణకు దిగే అవకాశం ఉంది. ఈ వారం నిఫ్టీకి 25,550 వద్ద మద్దతు స్థాయిలుండగా, 25,800 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మెరుగైన సంకేతాలు రాకుంటే ప్రైస్ యాక్షన్ టైట్‌గా ఉండే అవకాశం ఉంది. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో బలం పెరుగుతోంది. ఎఫ్ఎంసీజీ, ఐటీ, ఫార్మా రంగాలు బుల్లిష్‌గా ఉన్నాయి.

స్టాక్ రికమండేషన్స్

జేఎస్‌డబ్ల్యూ స్టీల్: జూలై నెలలో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరులో దిద్దుబాటు మొదలైంది. 15 శాతం వరకు పతనమయ్యాయి. రూ.875 స్థాయిలో మద్దతు తీసుకున్న ఈ షేరు మూడు సార్లు రూ.970 వద్ద నిరోధాన్ని ఎదుర్కొంది. గత శుక్రవారం నాటి సెషన్లో భారీ వాల్యూమ్‌తో ఈ స్థాయిని అధిగమించిన ఈ షేరు 3.50 శాతం లాభంతో రూ.981 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.980/960 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,050/1,100 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.940 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

ఎల్ అండ్ టీ: కొన్ని నెలలుగా సైడ్‌వేస్‌లో చలిస్తున్న ఈ కౌంటర్‌లో ప్రైస్ యాక్షన్ టైట్ అవుతోంది. మరోసారి కీలక నిరోధ స్థాయి రూ.3,860కి చేరువ అవుతోంది. ఒకవేళ దీన్ని అధిగమిస్తే భారీ ర్యాలీకి ఆస్కారం ఉంది. లేదంటే పడినప్పుడు కొనుగోలు చేయటం మంచిది. గత శుక్రవారం ఈ షేరు 2.99 శాతం లాభంతో రూ.3,860 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.3,750/ 3,700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.3,950 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,660 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

డీఎల్ఎఫ్: కొన్ని నెలల అప్‌ట్రెండ్ తర్వాత ఈ షేరులో మొదలైన కన్సాలిడేషన్ ఇంకా కొనసాగుతోంది. ప్రస్తుతం చక్కని బేస్ ఏర్పడుతోంది. ప్రస్తుతం ఈ షేరు కీలక నిరోధ స్థాయి రూ.870 వద్ద కదలాడుతోంది. గత శుక్రవారం 3.33 శాతం లాభంతో రూ.877 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో బ్రేకౌట్ జరిగే అవకాశం ఉంది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.870 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.950/990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.845 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్కార్ట్స్ కుబోటా: జీవితకాల గరిష్ఠాన్ని అందుకున్న ఈ షేర్లలో 16% మేర కరెక్షన్ జరిగింది. సెప్టెంబరులో అక్యుములేషన్ కనిపించింది. గత శుక్రవారం గణనీయమైన వాల్యూమ్‌తో ఈ షేరు ఏకంగా 6.88% లాభంతో రూ.4,079 వద్ద క్రాస్‌లైన్ నిరోధాన్ని దాటింది. చక్కని రిస్క్ రివార్డుతో ఆకర్షణీయంగా కనిపిస్తున్న ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.4,050 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.4,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.3,950 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మ్యాన్‌కైండ్ ఫార్మా: ఈ షేరులో ఈ ఏడాది ఆరంభంలో మొదలైన కరెక్షన్ ముగిసింది. ప్రస్తుతం ఈ షేరు కీలక నిరోధ స్థాయిని అధిగమించింది. మంచి స్ట్రెంత్‌తో నిలదొక్కుకుంటోంది. గత శుక్రవారం 4.52% లాభంతో రూ.2,355 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,525 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,600/ 2,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.2,500 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

26,000 చేరువలో నిఫ్టీ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం తొలి నాలుగు సెషన్లలో మైనర్ కరెక్షన్‌లో ట్రేడయినా శుక్రవారం బలమైన ర్యాలీ సాధించింది. నాలుగు రోజుల కరెక్షన్‌లో కూడా ప్రధాన మద్దతు స్థాయి 25,000 కన్నా పైన నిలకడగా ఉండడం మార్కెట్లో బలానికి సంకేతం. చివరికి వారం మొత్తం మీద 435 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ స్థాయి 25,800 చేరువలో ముగిసింది. గత కొద్ది వారాల్లో నిఫ్టీ ఎలాంటి కరెక్షన్ లేదా కన్సాలిడేషన్ లేకుండా 23,800 స్థాయి నుంచి 2,000 పాయింట్ల మేరకు రికార్డు ర్యాలీని సాధించింది. అయితే మిడ్‌క్యాప్ సూచీ తొలుత బలమైన కరెక్షన్ సాధించి 2,000 పాయింట్లు నష్టపోయినా శుక్రవారం బలమైన బౌన్స్‌బ్యాక్ సాధించి చివరికి 175 పాయింట్ల లాభంతో ముగిసింది. స్మాల్‌క్యాప్ సూచీ మాత్రం 170 పాయింట్ల నష్టంతో ముగిసింది. గత కొద్ది వారాలుగా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు కరెక్షన్ సాధిస్తూ వస్తున్నాయి. మానసిక అవధి 26,000 వద్ద నిఫ్టీ అప్రమత్త సానుకూల ధోరణిలో ప్రారంభం కావచ్చు. తదుపరి దిశ తీసుకునే ముందు కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ధోరణి ప్రదర్శించినట్టయితే శుక్రవారం నాటి గరిష్ఠ స్థాయి 25,850 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మానసిక అవధి 26,000. ఇక్కడ కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ ఉండవచ్చు.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 25,600 కన్నా దిగజారితే మైనర్ బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 25,400. భద్రత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారంలో అన్ని సూచీల కన్నా మెరుగ్గా ట్రేడయి 1,850 పాయింట్ల మేరకు లాభపడి 53,800 వద్ద క్లోజయింది. ఈ వారంలో పుల్‌బ్యాక్ రియాక్షన్ ఏర్పడవచ్చు. ప్రధాన నిరోధం 54,000. సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. మద్దతు స్థాయి 53,300 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

పాటర్న్: మధ్యకాలిక నెలవారీ చార్టుల ప్రకారం మార్కెట్ ఓవర్‌బాట్ స్థితిలో ఉన్నట్టు ఆర్ఎస్ఐ సూచీ సంకేతం ఇస్తోంది. గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలన్న సంకేతం ఇది. మార్కెట్ ప్రస్తుతం 26,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు			
	నిరోధం :	25,850	25,930
	మద్దతు :	25,760	25,700

ఎక్సైజ్‌లో సిఫారసుల వెల్లువ!

» బదిలీల కోసం మంత్రిపై పెరుగుతున్న ఒత్తిళ్లు

» ముఖ్య నగరాల్లో పోస్టింగుల కోసం విపరీతమైన పోటీ

» 'వైసీపీ' అధికారులకూ నేతల లేఖలు

» మాకు ఇప్పుడూ అన్యాయమేనా?

» వైసీపీ బాధిత అధికారుల ఆవేదన

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎక్సైజ్ శాఖలో జరుగుతున్న బదిలీలకు సంబంధించి ఆ శాఖ మంత్రిపై తీవ్రమైన ఒత్తిళ్లు వస్తున్నాయి. ఒకప్పుడు కొన్ని బదిలీలను మాత్రమే రాజకీయ సిఫారసులపై చేస్తే, మిగిలినవి సమర్థత, సీనియారిటీ ఆధారంగా చేసేవారు. కానీ ఇప్పుడు ఉన్నతాధికారుల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకు అన్ని స్థాయిల పోస్టింగుల కోసం సిఫారసులు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా మద్యం షాపులు, బార్లు ఎక్కువగా ఉండే విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఏలూరు, ఇతర ముఖ్య నగరాల్లో పోస్టింగుల కోసం అధికారుల మధ్య పోటీ విపరీతంగా పెరిగింది. గత ప్రభుత్వంలో రెండుగా చీలిపోయిన ఎక్సైజ్ శాఖ ఏకీకరణ జరగడం, ప్రైవేటు మద్యం షాపుల పాలసీ వస్తుండటంతో ఎక్సైజ్‌లో పోస్టింగులకు డిమాండ్ పెరిగింది. ముఖ్య నగరాలు, పట్టణాలు ఎక్కువగా ఉండే జిల్లాలు కావాలని అధికారులు పోటీపడుతున్నారు. డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మూడు కేడర్ల అధికారులూ అవే కోరుకుంటున్నారు. ఈ క్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి పెద్దఎత్తున సిఫారసు లేఖలు తెచ్చుకుంటున్నారు. ఇదే అదనుగా గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన కొందరు అధికారులకూ మంత్రులు, కూటమి ఎమ్మెల్యేలు లేఖలు ఇవ్వడంపై విమర్శలొస్తున్నాయి. రాష్ట్రంలోనే అతిపెద్ద నగరమైన విశాఖపట్నంలో పోస్టింగుల కోసం విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఏఈఎస్, సీఐల వరకు అన్ని కేడర్ల పోస్టులకూ భారీగా పోటీపడుతున్నారు. అయితే ఆ జిల్లాలో తాను చెప్పిన వారికే పోస్టింగులు ఇవ్వాలని ఓ ఎమ్మెల్యే పట్టుబడుతున్నారు. ఈ జిల్లాలో పోస్టింగుల కోసం కొందరు మంత్రులు ఇచ్చిన సిఫారసుల లేఖలనూ పక్కన పెడుతున్నట్లు తెలిసింది. అయితే ఆ ఎమ్మెల్యే 'వైసీపీ' అధికారులకూ సిఫారసు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో ఆ నగరం రిజర్వ్ కోటాలోకి వెళ్లిపోయింది. విశాఖపట్నంలో పాతుకుపోయిన అధికారులకే పోస్టింగులు ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై అటు రాజకీయ వర్గాల్లో, ఇటు అధికార వర్గాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

అప్పుడూ.. ఇప్పుడూ

గత ప్రభుత్వంలో కీలక పోస్టుల్లో పనిచేసిన అధికారులు ఇప్పుడు మళ్లీ మంచి పోస్టుల కోసం ప్రయత్నిస్తున్నారు. ఎక్కువ కాలం విజయవాడలో పనిచేసిన అధికారి ఇప్పుడు మళ్లీ విజయవాడకు రావాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అప్పట్లో స్పెషల్ సీఎస్‌తో కలిసి ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే బార్లకు మేలు చేసేందుకు ప్రభుత్వ మద్యం షాపులను మార్చేశారు. అప్పట్లో విశాఖపట్నంలో హవా సాగించిన మరో అధికారి ఇప్పుడు మళ్లీ అదే కావాలని ప్రయత్నిస్తున్నారు.

మహిళా అధికారులూ.. పోటాపోటీ

ఏలూరు డిప్యూటీ కమిషనర్ పోస్టు కోసం ఇద్దరు మహిళా అధికారుల మధ్య భారీ పోటీ ఏర్పడింది. వారిలో ఓ అధికారిపై 'వైసీపీ' ముద్ర ఉంది. గత ప్రభుత్వంలో డిస్టిలరీ విభాగంలో పని చేసి, అప్పటి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డితో అంటకాగినట్లు విమర్శలున్నాయి. మరో అధికారి రాయలసీమలో పనిచేశారు. నాయకులు ఈ ఇద్దరికీ సిఫారసుల లేఖలు ఇవ్వడంతో పోటీ ఏర్పడింది. ఇక గుంటూరు ఈఎస్ పోస్టు కోసం కూడా ఇద్దరు మహిళా అధికారులు పోటీపడుతున్నారు. వారిలో ఓ అధికారి గత ప్రభుత్వంలో సెబ్‌లో చక్రం తిప్పారు. మద్యం డిపోలో పనిచేస్తున్న మరో అధికారి ఈ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నారు. ఇక, గత ప్రభుత్వంలో అనామక పోస్టుల్లో పనిచేసిన అధికారులు ఇప్పుడు కూడా తమకు అన్యాయం జరుగుతుందేమోనని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. జేసీ స్థాయిలోని ఓ అధికారి గత ప్రభుత్వంలో బాధిత అధికారిగా ఉన్నారు. గత ప్రభుత్వంలో వేధింపులకు గురిచేయడంతో తాను ఇక్కడ ఉండలేనని, తెలంగాణకు వెళ్లిపోతానని కూడా దరఖాస్తు చేసుకున్నారు. అలాంటి వారికి ఇప్పుడైనా న్యాయం చేస్తారా? అనే సందేహాలు నెలకొన్నాయి.

డీఆర్‌డీఏ పీడీల బదిలీలు

23 మంది మున్సిపల్ కమిషనర్లు కూడా..


అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలువురు డీఆర్‌డీఏ పీడీలతో పాటు మున్సిపల్‌శాఖ పలువురు కమిషనర్లను బదిలీ చేస్తూ ఆదేశాలిచ్చింది. భీమిలి డివిజన్ డీఎల్‌డీఓ బి.లక్ష్మీపతిని విశాఖపట్నం డీఆర్‌డీఏగా పీడీగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న పీడీ ఎం.ఎస్ శోభారాణిని ఆమె సొంత శాఖ సాంఘికసంక్షేమశాఖకు బదిలీ చేశారు. గుంటూరు డ్వామా కార్యాలయంలో విజిలెన్స్ అధికారి టి.వి. విజయలక్ష్మిని గుంటూరు డీఆర్‌డీఏ పీడీగా నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న డీఎల్‌డీఓ డి.ప్రతాప్‌రెడ్డిని కర్నూలు డీఆర్‌డీఏ పీడీగాను, నగరి డ్వామా క్లస్టర్ ఏపీడీగా ఉన్న టి.ఎన్. శోభన్‌బాబును తిరుపతి జిల్లా డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీగాను, కృష్ణా డ్వామాలో ఫైనాన్స్ మేనేజర్‌గా ఉన్న వి.నాగరాజకుమారిని నెల్లూరు డీఆర్‌డీఏ పీడీగా నియమించారు. చిత్తూరు డీఆర్‌డీఏ పీడీగా ఉన్న డీఎంకే తులసిని ఆమె సొంత శాఖ వాణిజ్య పనులశాఖకు రీపాట్రియేట్ చేశారు. శ్రీకాకుళం డ్వామా ఏఓగా ఉన్న డీఎల్‌డీఓ విద్యాసాగర్‌ను అనకాపల్లి డీఆర్‌డీఏ పీడీగా నియమిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాక ఉత్తర్వులు జారీచేసింది. అదే విధంగా మున్సిపల్‌శాఖలోనూ బదిలీలు చేశారు. అదే విధంగా పలు జిల్లాలకు సంబంధించి ఎంపీడీఓల అంతర్‌జిల్లాల బదిలీలు కూడా చేపట్టారు. పలువురు ఎంపీడీఓలు ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 23 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు ఇచ్చారు.

అటవీశాఖలో బదిలీలు, పోస్టింగ్‌లు

సాధారణ బదిలీల్లో భాగంగా అటవీశాఖలో 13మంది స్టేట్ క్యాడర్‌లోని అసిస్టెంట్, డిప్యూటీ కన్జర్వేటర్లను ప్రభుత్వం బదిలీ చేసి, పోస్టింగ్‌లు ఇచ్చింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. హెడ్ ఆఫీస్‌లోని ఎం.శామ్యూల్‌ను అనకాపల్లి డీఎఫ్‌వోగా, కృష్ణా జిల్లా డీఎఫ్‌వో కె.రాజశేఖర్‌రావును ప్రకాశం జిల్లా సోషల్ ఫారెస్ట్‌కు, ప్రకాశం డీఎఫ్‌వో పి.సునీతను కృష్ణా జిల్లాకు, ఏలూరు సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో ఎం.హిమశైలజను గుంటూరు డీఎఫ్‌వోగా, అన్నమయ్య జిల్లా డీఎఫ్‌వో టి.నాగమణేశ్వరిని నంద్యాలకు, చింతపల్లి సోషల్ డీఎఫ్‌వో సీహెచ్ సూర్యనారాయణను ఏలూరు సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా, పాడేరు డీఎఫ్‌వో కె.వినోద్‌కుమార్‌ను శ్రీసత్యసాయి జిల్లా సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా, రాజమండ్రి ఏసీఎఫ్ టి.చక్రపాణిని శ్రీసత్యసాయి డీఎఫ్‌వోగా, పల్నాడు డీఎఫ్‌వో ఎస్.రామచంద్రరావును మంగళగిరి ఎఫ్‌యూఓగా, తిరుపతి డీఎఫ్‌వో జి.సతీష్‌ను ఎన్టీఆర్ జిల్లా డీఎఫ్‌వోగా, గిద్దలూరు డీఎఫ్‌వో వై.వి.నరసింహారావును చింతపల్లికి, రాజమండ్రి ఏపీఎస్ఎఫ్‌పి డీఎఫ్‌వో ఇ. హారికను సూళ్లూరుపేట వైల్డ్‌లైఫ్ డీఎఫ్‌వోగా, ఈస్ట్‌గోదావరి డీఎఫ్‌వో బి.నాగరాజును రాజమండ్రి ఏపీఎస్ఎఫ్‌పి డిప్యూటీ డైరెక్టర్‌గా పోస్టింగ్‌లు ఇచ్చారు.

మాటల్లోనే స్వచ్ఛత.. కానరాని శుభ్రత

చిత్రాలను చూస్తున్నారుగా.. ఇవి ఏ మారుమూల గ్రామాల్లోనో కాదు.. స్వయంగా జిల్లాలో ప్రధాన మునిసిపాలిటీలలో ఒకటైన పలాస, మేజర్ పంచాయతీల్లో ప్రముఖ వ్యాపార కేంద్రమైన నరసన్నపేటల్లోని పరిస్థితి.. ఒకపక్క ప్రభుత్వం స్వచ్ఛతాహీ సేవ అంటూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మరో పక్క సిబ్బంది నిర్లక్ష్యంతో ఇలా రోడ్ల పక్క, వీధుల్లోనూ చెత్త కుప్పలు రోజుల తరబడి కనిపిస్తున్నాయి. దీంతో అందరూ 'ఇదేనా స్వచ్ఛత' అంటూ ముక్కుల వేలేసు కుంటున్నారు. ఏ వీధిలో చూసినా, ఏ వార్డులో చూసినా, ఏ గ్రామంలో చూసినా ఇదే పరిస్థితి.. మరోపక్క సీజనల్ వ్యాధుల నియంత్రణలోనూ పరిసరాలను ఆరోగ్యంగా ఉంచాలని సంబంధితశాఖ పంచాయతీలకు సూచనలిస్తున్నా క్షేత్రస్థాయిలో ఎక్కడా ఆ ఛాయలు కనిపించడం లేదు. దీంతో ప్రజలు వ్యాధులతో ఆసుపత్రుల్లో చేరాల్సిన పరిస్థితి నెలకొంటోంది. అయితే పారిశుధ్య సిబ్బంది కొరత అంటూ పంచాయతీలు, మునిసిపాలిటీలు తప్పించు కోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. -పలాస/నరసన్నపేట/పలాస రూరల్


మొగిలిపాడులో రోడ్డుపైనే చెత్త నిల్వలు


పలాస శివాజీ నగర్‌లో..


పలాస రూరల్: బ్రాహ్మణతర్లాలో రోడ్డు పక్క వేసిన చెత్త


నరసన్నపేట: బొరిగివలస సంతోషిమాత ఆలయ సమీపంలో..

34 ఏళ్ల తర్వాత..

- గ్రామానికి చేరుకున్న బైపల్లి వాసి
- కుటుంబ సభ్యుల్లో ఆనందం
- సహకరించిన ఒడిశావాసులకు కృతజ్ఞతలు

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 22: బైపల్లి గ్రామానికి చెందిన తెప్పల లోకనాథం 34 ఏళ్ల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయాడు. ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అప్పట్లో గాలించినా ఫలితం లేకపోయింది. ఎట్టకేలకు ఆదివారం సాయంత్రం ఒడిశా వాసుల సహకారంతో ఆయన గ్రామానికి చేరుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు సంభ్రమాశ్చర్యానికి గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. బైపల్లికి చెందిన తెప్పల శ్రీరాములు, సావిత్రమ్మ దంపతులకు నలుగురు కుమారులు. వారిలో లోకనాథం రెండోవాడు. చిన్నప్పటి నుంచి అమాయకంగా ఉండే లోకనాథం పదేళ్ల వయసులో సుమారు 1990 సంవత్సరంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి.. తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆందోళన చెంది.. గ్రామస్థుల సహకారంతో ఎంత వెతికినా ఆయన ఆచూకీ లభ్యం కాలేదు. కాగా లోకనాథం తండ్రి శ్రీరాములు 12 ఏళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి సావిత్రి నాలుగేళ్ల కిందట కొవిడ్‌తో ప్రాణాలు కోల్పోయింది. మిగిలిన ముగ్గురు అన్నదమ్ములు వారి కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా.. అప్పట్లో ఇంటి నుంచి బయటకు వెళ్లిన లోకనాథం అనేక ప్రాంతాలు తిరిగి చివరకు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌కు చేరుకున్నాడు. కొద్దిరోజులుగా అక్కడ అమాయకంగా తిరుగుతుండడంతో స్థానికులు జాలిపడి ఆయన నుంచి వివరాలు సేకరించారు. ఈక్రమంలో తనది శ్రీకాకుళం జిల్లా బైపల్లి గ్రామం అని చెప్పడంతో.. ఒడిశా వాసులు తమకు తెలిసిన వ్యక్తుల ద్వారా ఫోన్‌లో లోకనాథం కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకున్నారు. వారితో మాట్లాడగా.. కొన్నేళ్ల కిందట లోకనాథం తప్పిపోయిన మాట వాస్తమేనని చెప్పారు. దీంతో ఆదివారం సాయంత్రం బైపల్లి గ్రామానికి లోకనాథాన్ని క్షేమంగా తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. 34 ఏళ్ల తర్వాత లోకనాథం కనిపించడంతో కుటుంబ సభ్యులు, అన్నదమ్ములు ఓ వైపు ఆశ్చర్యం, మరోవైపు ఆనందం వ్యక్తం చేశారు. క్షేమంగా ఇంటికి తీసుకువచ్చిన ఒడిశా వాసులకు కుటుంబ సభ్యులు, బైపల్లి పంచాయతీ టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెప్పల చాణుక్య, బొంపల్లి శివ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.


ఒడిశా వాసులతో లోకనాథం

ఘనంగా నిమజ్జనోత్సవాలు

హిరమండలం: ధనుపురం గ్రామంలో పోస్టాఫీస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఆదివారం ఘనంగా నిమజ్జనం చేశారు. గణనాథుని ఊరేగింపులో విద్యార్థినుల కోలాటం, గణేశ వేష ధారణలు ఆకట్టుకున్నాయి. యువత సందడి మధ్య మహేంద్రతనయ నదిలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.


వినాయకుని ఊరేగింపులో కోలాటం

పాతపట్నంలో విశ్వకర్మకు..

పాతపట్నం: విశ్వకర్మ జయం తి సందర్భంగా ఏర్పాటు చేసిన విశ్వకర్మ విగ్రహానికి ప్రత్యేక పూజ లు చేసి ఆదివారం నిమజ్జనం చేశా రు. గ్రామ ప్రధాన వీధుల్లో ఊరే గింపు, ప్రసాదం పంపిణీ కార్య క్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లోనూ లయన్స్‌క్లబ్ సేవలు

హరిపురం: లయన్స్ క్లబ్ సేవలను గ్రామాలకు విస్తరించే లక్ష్యంతో హరిపురం కోస్టల్ లయన్స్ క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆ క్లబ్ అధ్యక్షుడు బైరిశెట్టి గున్నయ్య అన్నారు. హరిపురంలోని కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో సోంపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా గవర్నర్ ఎన్ వీబీఎస్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.



కోస్టల్ లయన్స్‌క్లబ్ ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న అధ్యక్ష, కార్యదర్శులు

నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

హరిపురం కోస్టల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా బైరిశెట్టి గున్నయ్య, సెక్రటరీగా వైఎస్ఎన్ మూర్తి, ట్రెజరరీగా ఎం.లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడిగా సానా లింగేశ్, సర్వీసెస్ చైర్‌పర్సన్‌గా పుల్లా వాసు, చార్టర్ సభ్యుడిగా కొర్ల కన్నారావులతో పాటు పలువురు డైరెక్టర్లు, సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో హరిపురం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కె.స్వరాజ్యలక్ష్మి, వైద్యులు కె.కేశవరావు, రాజేంద్ర ప్రసాద్, జోగినాయుడు, జిల్లా లయన్స్ ప్రతినిధులు డీఎస్ఎస్‌వీ వర్మ, ఎ.గోపాలరావు, ప్రకాష్ సుబ్బరాజు, ఆర్.హేమాచలం, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కింజరాపు హయాంలోనే తీరప్రాంతాల అభివృద్ధి

సంతబొమ్మాళి: తీరప్రాంత గ్రామాల్లో అభివృద్ధి కింజరాపు కుటుంబంతోనే సాధ్యమని జిల్లా మత్స్యకార సంఘ నాయకుడు ధనరాజు చంటి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మా ట్లాడుతూ.. పర్యాటక శాఖ ద్వారా కోట్ల రూపాయల గ్రాంట్ మంజూరు చేయించి ఉమిలాడ, గెద్దల పాడు, పిట్టవానిపేట, పాతమేఘ వరం సముద్రతీరంలో రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారన్నారు. ప్రతిపాదనలు పంపిన 100 రోజుల్లో గ్రాంట్ తీసుకు వచ్చారని, త్వరలో మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు పనులను ప్రారంభిస్తారన్నారు. తీర ప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకార నాయకులు జోగారావు, శ్రీరంగరాజులు తదితరులు పాల్గొన్నారు.

'హిందూ సంప్రదాయాన్ని మంటగల్పిన జగన్'

టెక్కలి: వైసీపీ హయాంలో తిరు పతి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసి హిందూ సంప్రదాయాన్ని అప్ప టి సీఎం జగన్ మంటగలిపారని బీజేపీ నాయకుడు హనుమంతు ఉద య భాస్కర్ అన్నారు. ఆదివారం విలే కరులతో మాట్లాడుతూ.. నెయ్యికి బదులు జంతువుల కొవ్వు, చేపనూనె లను కలిపిన అంశం బయటకు పొక్క డంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వెంకన్న భక్తులు ఆందోళనకు గురయ్యాయన్నారు. లడ్డూ పవిత్రతను గత పాలకులు అపహాస్యం చేశారని విమర్శించారు. భక్తుల మనోభావాలను దెబ్బ తీసిన జగన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేప ట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు తమ మద్దతు ప్రకటించారు. ఈనెల 29న జాతీయ హిందూ పరిషత్ స్థాపకులు శ్రీకృష్ణ చరణానంద స్వామి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలకు అతీతంగా టెక్కలిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హరినారాయణ, దారపు చంద్రం తదితరులు పాల్గొన్నారు.

సుబ్బమ్మపేటలో ప్రత్యేక వైద్య శిబిరం

నందిగాం: సుబ్బమ్మపేటలో ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. నందిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి కె. అనిత కుమారి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో శిబిరాన్ని ఏర్పాటు చేసి రోగులను పరీక్షించారు. పలువురి నుంచి రక్త నమూనాలు సేకరించారు. 47 మందికి వైద్య పరీక్షలు చేసి ఐదుగురు జ్వర పీడితులుగా గుర్తించారు.

ఒడిశా బస్సుల్లో తనిఖీ

కొత్తూరు: ఒడిశా రాష్ట్రం నుంచి ఆంధ్రాలోకి వస్తున్న గంజాయి, మత్తు పదార్థాలను అరికట్టేందుకు గాను ఆదివారం ఒడిశా నుంచి వస్తున్న బస్సులను బలద గ్రామం వద్ద ఎస్ఐ అహ్మద్ తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన ప్రతి బ్యాగ్‌ను తనిఖీ చేశారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, గంజాయి అమ్మకాలు గాని, కొనుగోలు గాని రవాణా చేస్తే గాని కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

హుద్‌హుద్ ఇళ్ల కాలనీలకు రూ.3.60 కోట్లు మంజూరు

- ఎమ్మెల్యే శిరీష

పలస, సెప్టెంబరు 22: పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో హుద్‌హుద్ కాలనీలు, గృహాల్లో సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3.60 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. 2019లో పూర్తయిన హుద్‌హుద్ ఇళ్లను ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం లబ్ధి దారులకు ఇవ్వకపోవడంతో మరమ్మతులకు గురయ్యాయన్నారు. వాటిని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అలాగే ఇళ్ల సముదాయాలకు రోడ్లు, విద్యుత్, తాగునీటి కల్పనకు ఈ నిధులను వినియోగించనున్నారన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం 384 ఇళ్లను మంజూరు చేసి నిర్మాణం చేపట్టిందన్నారు. వైసీపీ హయాంలో నిర్లక్ష్యం వహించడంతో పాడయ్యాయన్నారు. వీటి మరమ్మతులకు కలెక్టర్ ఆదేశాల మేరకు మార్గదర్శకాలు తయారు చేశామని, పాత లబ్ధిదారులు ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొంది నట్లయితే వారిని మినహాయించి మిగిలిన వారికి అందిస్తామన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

నిధుల మంజూరుపై హర్షం

వజ్రపుకొత్తూరు: పలాస నియోజకవర్గంలో గతంలో టీడీపీ హయాంలో నిర్మాణమైన హుద్‌హుద్ ఇళ్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంపై వజ్రపుకొత్తూరు మండల టీడీపీ నేతలు హర్షం వ్యక్తంచేశారు. కాశీబుగ్గ ఇంగిలిగాం, వజ్రపుకొత్తూరు మండలం బెండి కొండ వద 384 హుద్ హుద్ ఇళ్ల నిర్మాణం చేపట్టారన్నారు. వైసీపీ హయాంలో నిర్లక్ష్యం వహించడంతో పాడయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇళ్ల మరమ్మతులకు నిర్ణయించడం హర్షణీయమన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, నేతలు పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, గొరకల వసంతరావు, ఎ.ఉమామహేశ్వరరావు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

కాశీబుగ్గ: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందా లని, ఇదే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ 18వ వార్డు సాయి కాలనీలో మెప్మా ఆధ్వర్యంలో మార్కండేయ సమాఖ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, నేతలు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారా యణ, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, మెప్మా అధికారి మోహన్‌రావు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి శ్రీ కొత్తమ్మతల్లి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి ఉత్సవాలుగా నిర్వహిస్తున్నందున అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారన్నారు. అందువల్ల వారికి ఇబ్బందులు కలుగకుండా అన్ని మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. అలాగే ఉత్సవాల పోస్టర్లను వాడవాడలా అతికించాలన్నారు. కార్యక్రమంలో ఈవో వాకచర్ల రాధాకృష్ణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఉత్సాహంగా గ్రిగ్స్ పోటీలు


కబడ్డీలో తలపడుతున్న కాపుతెంబూరు, పెద్ద బాణాపురం క్రీడాకారులు

నందిగాం: దేవళభద్ర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండలస్థాయి గ్రిగ్స్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను టెక్కలి డిప్యూటీ డీఈవో పి.విలియమ్స్ ప్రారంభించారు. జాతీయ జెండాను, క్రీడా జెండాను ఆవిష్కరించి క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ పోటీలను నిర్వహించారు. 14 హైస్కూళ్లు, రెండు గిరిజన ఆశ్రమ పాఠశాలల నుంచి సుమారు 400 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభను ప్రద ర్శించారు. విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావు, హెచ్ఎం డి.పూర్ణిమ, టీడీపీ నాయకులు మళ్ల బాలకృష్ణ, ఎస్.ప్రసాదరావు, ఎస్ఎంసీ చైర్మన్ బి.ప్రమీల, టెక్కలి, నందిగాం మండలాల పీడీలు జి.శ్రీనివాసరావు, ఎస్..రమేష్, జగ్గమ్మ, నారాయణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌సీడీసీ సమావేశానికి జిల్లా మత్స్యకార నేతలు

సంతబొమ్మాళి: దేశ రాజధాని న్యూఢిల్లీలో నేషనల్ కోపరేటివ్ డెడ్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) శనివారం జరిగిన సమావేశంలో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన మత్స్యకారులకు అవకాశం కలిగింది. సంతబొమ్మాళి మండల మరువాడ గ్రామానికి చెందిన తెలుగు యువత జిల్లా కార్యదర్శి సూరాడ రామ రాజు, జిల్లా మత్స్యకార సంఘ నాయకుడు చీకటి శ్రీరాములు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం మత్స్యకార స్థితిగతులు, అభివృద్ధిపై ప్రణాళికలను సమావేశంలో వివరించారన్నారు. అనంతరం మత్స్యకార సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు.


జాతీయస్థాయి సమావేశంలో పాల్గొన్న జిల్లా మత్స్యకార నాయకులు

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో ఛాయాకిరణ్ ప్రతిభ

పలాస: పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు చెదిన గుడిపూడి ఛాయాకిరణ్ రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించాడు. ఈనెల 13, 14, 15 తేదీల్లో కాకి నాడ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలో జిల్లా తరఫున పాల్గొని ద్వితీయస్థానం సాధించాడు. ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు హర్యానా రాష్ట్రం గోహితక్‌లో జరగనున్న సబ్ జూనియర్స్ జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రం తరఫున పాల్గొననున్నాడు.



తెప్పలకు జీవిత సాఫల్య పురస్కారం

పలాసరూరల్: హైదరాబాద్ డాక్టర్ దేవులపల్లి అదర్శ కళానిలయం సంస్థ జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తికి జీవితసాఫల్య పురస్కారాన్ని ఆదివారం అందజేసింది. మూడు దశాబ్దాలుగా నాటక, సాహితీ రంగాల్లో కృష్ణమూర్తి చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డు అందించినట్లు నిర్వాహకులు ప్రకటించారు. అతిథులు రామ్‌రెడ్డి బొఖ్యా, సినీనటులు రాజేంద్రకుమార్, గణేష్ రెడ్డి, జానపద కళాకారులు భిక్షునాయక్, జబర్దస్త్ అప్పారావు తదితరుల ఆధ్వర్యంలో ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తిని ఉద్దానం సాహితీ వేదిక, లయన్స్ క్లబ్ సభ్యులు అభినందించారు.



అవార్డును అందుకుంటున్న కృష్ణమూర్తి

యూటీఎఫ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

ఎల్.ఎన్.పేట: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఆదివారం ఉపాధ్యాయులకు వివిధ క్రీడా పోటీలను ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా యూటీ ఎఫ్ జిల్లా కార్యదర్శులు టి.భాస్కరరావు, జి.శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ.. స్వర్ణోత్సవాల్లో భాగంగా ఉపాధ్యాయులకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ఆమదాలవలస, సరు బుజ్జిలి, బూర్జ, ఎల్.ఎన్.పేట మండలాల ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్‌కమిటి సభ్యులు జయరాం నాలుగు మండలాల యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉండి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోండి

టెక్కలి: డా.బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపిన పశ్చిమగోదావరి జిల్లా ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావు ఒక ప్రకట నలో కోరారు. అంబేడ్కర్ ఫ్లెక్సీని చించివేయడం సంఘ విద్రోహ చర్యగా భావిస్తున్నామన్నారు. సున్నిత మైన విషయాలను పరిష్కరించాల్సిన ఎమ్మెల్యే విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించడం దారుణమన్నారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

టెక్కలి: కేంద్ర మంత్రిగా కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రిగా అచ్చెన్నాయుడు జిల్లా అభివృద్ధికి చేస్తున్న కృషిని చూడలేకే టెక్కలి వైసీపీ ఇన్‌చార్జి పేరాడ తిలక్ విమర్శలు చేస్తున్నారని జీయన్నపేట ఎంపీటీసీ నంబాళ్ల రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నీవు అవినీతిపరుడవని మీ పార్టీకి చెందిన మహిళా నేత రెండు రోజుల కిందట చేసిన విమర్శలను మర్చిపోయావా అని తిలక్ నుద్దేశించి అన్నారు. నేతల మెప్పుకోసం తిలక్ వారికి భజనలు చేసుకోవచ్చుని, అయితే అబద్ధపు ప్రచారా చేయడం తగదన్నారు. వైసీపీ అధినేత జగన్ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌కు ఇచ్చిన ఝలక్ తిలక్‌కే కూడా ఇస్తారన్నారు. జిల్లాలో అభివృద్ధి పరుగులు తీయడానికి అబ్బాయి, బాబాయిలే కారణమన్నారు.

సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.10 లక్షలు మంజూరు

డోల(పోలాకి): డోల గ్రామానికి చెందిన రుంకు ధాన్వికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.10 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆదివారం చెక్కును ఆమె తండ్రి ఉమామహేశ్వరరావుకు అందించారు. ఆమె పుట్టిన నాటి నుంచి దీర్ఘకాలిక వ్యాధి తో బాధపడుతుండగా చికిత్స నిమిత్తం ఈ మొత్తం మంజూరైంది.

ఫ్లెక్సీల చించివేసిన వారిని శిక్షించండి

నందిగాం: డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల సందర్భంగా గొల్లూరులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జనసేన టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు తాడేల చిరంజీవులు కోరారు. ఈ మేరకు ఆదివారం పోలీసులకు వినతిపత్రం అందించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి ఎస్.షణ్ముఖరావు, పి.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుతాగి వ్యక్తి ఆత్మహత్య


రమణ(ఫైల్)

గార: అంపోలు గ్రామానికి చెందిన కోరుపోలు రమణ(38) అనే వ్యక్తి పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రమణ మద్యానికి బానిస కావడంతోపాటు తరచూ వళ్లు నొప్పులు ఉన్నాయంటూ చెప్తుండేవాడు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం పురుగులు మందు తాగి ఇంటికి వచ్చిన రమణ.. తన భార్య సంతోషికి ఈ విషయం చెప్పడంతో కుటుంబ సభ్యులు వెంటనే అతడిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం చనిపోయాడు. కాగా రమణకు ఇద్దరు చిన్న కుమారులు ఉన్నారు. సంతోషి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ జనార్దనరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమార్తెలకు గాయాలు

కంచిలి: జాతీయ రహదారి బలియాపుట్టుగ జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమార్తెలు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కంచిలి మండలం జలంత్రకోట గ్రామానికి చెందిన మూలి ప్రదీప్, తన ఐదేళ్ల కుమార్తె స్వాతితో కలసి పోలేరు గ్రామంలో జరిగిన ఒక శుభకార్యక్రమానికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరిగి గ్రామానికి వస్తున్న క్రమంలో బలియాపుట్టుగ జంక్షన్ సమీపంలో గుర్తుతెలియని వాహనం వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రదీప్ తలకు బలమైన గాయంతోపాటు ఎడమ కాలు విరిగిపోయింది. కుమార్తె స్వాతి తల, కాలికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి వీరిని ద్విచక్రవాహనంపై సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అంబులెన్స్‌లో శ్రీకాకుళం ఆసుపత్రికి తరలించారు.

గోవధకు పాల్పడిన వ్యక్తి పై కేసు నమోదు

రణస్థలం: మండల కేంద్రంలోని గోవధకు పాల్పడిన మహ్మద్ సమీర్‌పై కేసు నమోదు చేసినట్టు జేఆర్ పురం ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఆదివారం ఉదయం మండల కేంద్రానికి సమీపాన ఒక తోటలో ఆవులను వధించి, ఆ మాంసాన్ని విక్రయిస్తున్న సమీర్‌ను పోలీసులు పట్టుకున్నారు. అక్కడ ఉన్న మూడు ఆవులను గోశాలకు తరలించి, గోవధకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఎవరైనా గోవధకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు


పార్శిల్స్ పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్

శ్రీకాకుళం క్రైం: నగరంలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పార్శిల్ సర్వీస్ కేంద్రంలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో భాగంగా నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో గాలింపు చేపట్టామన్నారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ప్రజలు సహకరించాలని, అటువంటి వారు తారసపడినప్పుడు డయల్ 100కు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ ఆర్.సంతోష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యాలయలో లడ్డూ నాణ్యత పరిశీలన


లడ్డూ ప్రసాదాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి: ఇటీవల తిరుపతి లడ్డూల తయారీలో నెలకొన్న దారుణ పరిస్థితుల నేపథ్యంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను, క్యూలైన్లను పరిశీలించి మెరుగైన సేవలను అందించాలని సూచించారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని తర్వాత ప్రసాదాల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. నిత్యాన్నదాన పాకశాలను పరిశీలించి భక్తులతో కలిసి అన్న ప్రసాదం స్వీకరించారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా నాణ్యమైన ప్రసాదాన్ని అందజేయాలన్నారు. ఇంద్రపుష్కరిణి పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆలయ ఈవో రమేష్‌బాబు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ సిబ్బంది, కూటమి నాయకులు ఉన్నారు.

దేశాలమ్మకు ప్రత్యేక పూజలు

జి.సిగడాం: గ్రామ దేవత చెవిటి పోలమ్మ ఉత్సవాలు సందర్భంగా ఆదివారం పెంట గ్రామంలో దేశాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మహిళా భక్తులు తలంటి స్నానమాచరించి భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పసపు, కుంకుమ, నైవేద్యం, ముర్రాటలు చెల్లించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు అంతా గ్రామ శివారుకు వెళ్లి అమ్మవారికి చీరలు చూపించి పూజలు చేశారు.

కొండపోరంబోకు భూమి కబ్జా

- విద్యుత్తు అధికారి దందా
- చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం
- సచివాలయం కార్యదర్శి నోటీసులిచ్చినా బేఖాతరు

(శ్రీకాకుళం రూరల్)

అతడో ప్రభుత్వ ఉద్యోగి. ఓ వైసీపీ నాయకుడి అండతో ఏకంగా కొండ పోరంబోకు భూమినే కబ్జా చేశాడు. ఆపై అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాడు. సచివాలయ అధికారులు నోటీసులిచ్చినా.. అక్రమాలు కొనసాగించడం చర్చనీయాంశమవుతోంది. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం మండలం, సింగుపురం పంచాయతీ పరిధిలోని కొండ పోరంబోకుగా ప్రభుత్వ రెవెన్యూ రికార్డుల్లో ఉన్న 1.20ఎకరాల భూమిని విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న ఓ ఉన్నత ఉద్యోగి ఆక్రమించాడు. రాత్రుళ్లు యంత్రాల సాయంతో కొండను తవ్వించి పునాదులు వేయించుకున్నాడు. ఈ అక్రమ నిర్మాణాలను గుర్తించిన పంచాయతీ కార్యదర్శి ఎ.రమేష్ అక్కడికి వెళ్లి హెచ్చరించినా పట్టించుకోకుండా తన పని తాను చేయించుకుంటున్నాడు. తన సోదరుడైన వైసీపీ నాయకుడి అండదండలతోనే ఈ తతంగాన్ని నడిపిస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ స్థలంలో తన భార్య పేరుమీద విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయించున్నాడు. అదే శాఖలో ఆయన ఉన్నత ఉద్యోగి కావడంతో ఎటువంటి పత్రాలు లేకుండానే మీటర్ మంజూరు కావడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా ఆరు నెలల వ్యవధిలో పంచాయతీ అధికారులు రెండుసార్లు నోటీసులు అందజేశారు. అయినా అక్రమ నిర్మాణాలు కొనసాగించాడు. ఉన్నతాధికారుల దృష్టికి పంచాయతీ అధికారులు తీసుకువెళ్లినా వారు పట్టించుకోకపోవడం విశేషం. దీనిపై తహసీల్దార్ గణపతిరావు వద్ద ప్రస్తావించగా.. అక్రమ నిర్మాణాలను గుర్తించామని, చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆక్రమించిన కొండ పోరంబోకు స్థలంలో భారీ స్థాయిలో నిర్మాణాలతో పాటు మిగిలిన చోట్ల పశువుల శాలలు ఉన్నట్టు క్షేత్రస్థాయిలో గుర్తించామన్నారు.


ఆక్రమించిన స్థలంలో చేపట్టిన నిర్మాణాలు, ఇన్‌సెట్‌లో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఇది ప్రజా కూటమి ప్రభుత్వం

- రణస్థలం ఎమ్మెల్యే ఎన్ఈఆర్


జి.సిగడాం: అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం: రాష్ట్రానికి సుపరిపాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజా కూటమి ప్రభుత్వమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. ఆదివారం మునినివలసలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజుల్లో ఎన్నికల్లో ఇచ్చిన పలు హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందన్నారు. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. అమరావతిని శ్మశానంగా అభివర్ణించి, రాజధానిని మూడు ముక్కలాట ఆడిని రాక్షస వైసీపీకి రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. అలాగే జాడలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు కుమరాపు రవికుమార్, వజ్జపర్తి రఘురాం, బూపతి అర్జున్ కుమార్, టంకాల మౌళీశ్వరావు, బాడాన జనార్దనరావు, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో నిశ్చల, ఎంఈవోలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే సంతృప్తికర పాలన

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం నగరంలోని గొంటి వీధిలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాన్ని సంక్షభం నుంచి సంక్షేమం వైపు నడిపిస్తున్న మంచి ప్రభుత్వం ఇదని అన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే చాలా పథకాలు అమలు చేసి 'ఇది మంచి ప్రభుత్వం' అనిపించుకుంటోందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శతశాతం హామీలు నెరవేరుస్తాం

- నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


చెల్లాయివలసలో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దశలవారీగా శతశాతం నెరవేరుస్తామని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం చెల్లాయివలసలో 'మా మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించి పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో రాష్ట్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు దానిని గాడిలో పెట్టడంతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అలాగే 100 రోజుల్లో నే అనేక హామీలను నెర వేర్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు డోల జగన్, బైరి భాస్కరరావు, రోణంకి కృష్ణంనాయుడు, ఎంపీ నాయుడు, చిట్టి సింహాచలం, జనసేన నాయకుడు మెట్ట వైకుంఠరావు, బీజేపీ నాయకుడు కరుకోల రామారావు, తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్, ఎంపీడీవో కె.ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్లు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే అశోక్, అధికారులు

వ్యవస్థలను భ్రష్టుపట్టించిన వైసీపీ

- ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్

కంచిలి: స్కీంల పేరుతో వైసీపీ ప్రభుత్వం ప్రజాధనం లూటీ చేసిందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. తలతంపర గ్రామంలో ఆదివారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ రాక్షస పాలనతో ప్రజలంతా విసుగు చెంది, కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా తీర్పు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దాసరి రాజు, ఎంపీడీవో వి.నీరజ, తహసీల్దార్ వై.జయలక్ష్మి, ఎంఈవో శివరాంప్రసాద్, సర్పంచ్ జగబంధు దొళాయి, మాదిన రామారావు తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమానికి హాజరు కాని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మోహన్‌కు మెమో జారీ చేయాలని ఎంపీడీవో వి.నీరజను ఎమ్మెల్యే అశోక్ ఆదేశించారు.


ఆమదాలవలస: చీమలవలసలో...


అరసవల్లి: ఏపీహెచ్‌బీ కాలనీలో అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

ఆదిత్యుని సన్నిధిలో హైకోర్టు జడ్జి


హైకోర్టు జడ్జికి జ్ఞాపికను అందిస్తున్న ఆలయ ఈవో

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. వారికి స్వామివారి ప్రసాదాలను, జ్ఞాపికను ఆలయ ఈవో రమేష్‌బాబు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు. కాగా ఆదివారం ఒక్కరోజు స్వామివారికి రూ.3.44లక్షల ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.1,08,000, విరాళాల ద్వారా రూ.72,830, ప్రసాదాల ద్వారా రూ.1,64,030 లభించినట్టు ఆలయ ఈవో తెలిపారు.

శ్రీముఖలింగేశ్వరస్వామిని..

జలుమూరు: దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరస్వామిని హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్.సుబ్బారెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు చేయించారు. స్వామివారి శేష వస్త్రాలు అందించారు. అనంతరం ఆలయ విశిష్టతను, స్వామి పురాణ గాథను అర్చకులు వివరించారు. జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా, కోటబొమ్మాళి సివిల్ కోర్టు న్యాయాధికారి ప్రసన్నలత, నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు, జలుమూరు ఎస్‌ఐ అశోక్‌బాబు, ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు సింహాచలం, వెంకటాచలం, శ్రీకృష్ణ, శివ, సిబ్బంది పాల్గొన్నారు.

డాగ్‌స్క్వాడ్ తనిఖీలు


జాగిలంతో తనిఖీలు చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: పట్టణంలోని ఎస్‌ఐ వెంకటేష్, పోలీసులు పలు ప్రాంతాల్లో గంజాయిపై తనిఖీలు ఆదివారం నిర్వహించారు. పోలీస్ జాగిలాలతో రైల్వేస్టేషన్‌తో పాటు బ్రహ్మపుర-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో, పొందూరు రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో గంజాయిపై నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌ఐ తెలిపారు.


అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి



ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

అరసవల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, పెరిగిన ధరలకు అనుగుణంగా వారి వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కల్యాణి, డి.సుధ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏపీ అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముందుగా కార్మిక కర్షక పోరాటాల మార్గదర్శి సీతారాం ఏచూరి మృతికి నివాళులర్పించారు. మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, ప్రభుత్వం ఇచ్చిన జీవోలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు హైమావతి, హేమ, సుజాత, హేమలత, లక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై గోతులు పూడ్చివేత


గోతులను పూడ్చుతున్న యువత

బూర్జ: పాలకొండ-శ్రీకాకుళం ప్రధాన రహదారిలో కొరగాం జంక్షన్ సమీపాన ఏర్పడిన భారీ గుంతలను ఆ గ్రామానికి చెందిన సీతారామ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పూడ్చివేశారు. సింగన్నపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు, మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు అనంతగిరి, మజ్జి అప్పలనాయుడు, హరీష్, తేజ, నవీన్, రాంప్రసాద్, సాయి, జస్వంత్ తదితరులు గోతలు పూడ్చివేతలో పాల్గొన్నారు.

దశావతార స్తోత్ర మంజరి పుస్తకావిష్కరణ


పుస్తక ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: కోదండరామాలయంలో ఉన్న ఉపనిష్మందిరంలో నర్సింహారావు రాసిన దశావతార స్తోత్ర మంజరి పుస్తకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కోమలరావు, పతంజలి శాస్త్రి, నిష్టల నరసింహమూర్తి, జంధ్యాల శరత్‌బాబు, వెంకటరమణ, పి.మనోహర్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కలిసి పోరాడాలి


నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీకాకుళం స్పోర్ట్స్: సమస్యల పరిష్కారానికి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కలిసి పోరాటం చేయాలని ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమనాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో గల సెమినార్ హాల్‌లో ఆదివారం ఏపీటీఎఫ్ ఎనభై వసంతాల వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బల్లెడ రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విభజించి పాలించిందని, తమ సమస్యలను తొక్కిపెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వంఈ ప్రభుత్వం మూడు నెలల నుంచి ఒకటో తేదీన జీతాలు ఇవ్వడం తప్పా మరే సమస్యపై సానుకూలత చూపించడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే సీఎంను కలుస్తామన్నారు. జడ్పీ సీఈవో ఆర్.వెంకట్రామన్ మాట్లాడుతూ.. సంఘాలు అంటే ప్రభుత్వాలకు యావగింపుగా తయారయ్యిందన్నారు. ప్రజల్లో మనపై చెడు భావాన్ని ప్రచారం చేయడం ఒక భాగమేనన్నారు. డీఈవో ఎస్.తిరుమల చైతన్య మాట్లాడుతూ.. నిరంతరం నేర్చుకోవడం, నేర్పించడమే ఉపాధ్యాయుని ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవో సంఘ జిల్లాశాఖ అధ్యక్షులు హనుమంతు సాయిరాం, రిటైర్డు డీఈవో బలివాడ మల్లేశ్వరరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి, జిల్లా గౌరవాధ్యక్షులు చింతాడ దిలీప్‌కుమార్, డిప్యూటీ డీఈవో విలియమ్స్, ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా సబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం


సీఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: దివంగత మాజీ ఎంపీపీ బల్లాడ వెంకట రమణారెడ్డి కుటుంబ సభ్యులు విజయవాడ వరద బాధితుల కోసం రూ.లక్ష సాయాన్ని అందించారు. ఈ మేరకు ఆదివారం అమరావతిలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి సీఎం చంద్రబాబుకు అందజేశారు. కార్యక్రమంలో రమణారెడ్డి కుటుంబ సభ్యులు బల్లాడ అరుణ, ప్రతిభ, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **కంచిలి:** విజయవాడ వరద బాధితులకు కంచిలి విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు, యాజమాన్యం, సిబ్బంది కలిసి రూ.20వేలు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆదినారాయణ, టీడీపీ నాయకులు జగదీష్ పట్నాయక్, మురళీ పట్నాయక్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలతో మానసికోల్లాసం


టగ్ ఆఫ్ వార్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఎచ్చెర్ల: సాంస్కృతిక, క్రీడా పోటీలతో మానసికోల్లాసం ఉంటుందని ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. ఇక్కడి క్యాంపస్‌లో ఆదివారం ఎన్ఎస్ఎస్ వారోత్సవాల్లో భాగంగా ఆనంద ఆదివారం నిర్వహించారు. ఏవో ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పెద్దింటి ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న బ్యాంక్ అధికారులు, సిబ్బంది

అరసవల్లి: లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు అధికారులు పట్టణంలో ఆదివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతను వివరిస్తూ, ప్రజలను చైతన్యపరుస్తూ ఈ ర్యాలీ సాగింది. యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ ఎం.వెంకటతిలక్, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్యకిరణ్, సిబ్బంది కె.తేజేశ్వరరావు, శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుని నిమజ్జనం


నృత్యం చేస్తున్న యువత

ఆమదాలవలస: కొర్లకోట గ్రామంలో అంబేడ్కర్‌నగర్ వీధిలో వినాయడి నవ రాత్రి ఉత్సవాలు నిర్వహించారు. 15 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. భజన కార్యక్రమాలు, ముగ్గుల పోటీలు చేపట్టామన్నారు. విజేతలకు బహుమతులు అందించామన్నారు. కాగా ఆదివారం భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనుపోత్సవంలో యువత నృత్యాలతో అలరించారు.

వివాహిత ఆత్మహత్య


హరిపురం: నారాయణపురం పంచాయతీ చిన్నకేసుపురంలో కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మందస ఎస్‌ఐ ఖాదర్‌బాషా తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చిన్నకేసుపురం గ్రామానికి చెందిన బొడ్డు కూర్మారావు, రూపావతిల కుమారుడు బొడ్డు భవానీ శంకర్‌కు పలాస మండలం మొగిలిపాడు గ్రామానికి చెందిన సమీర (20)తో 2020 డిసెంబరులో వివాహమైంది. వీరికి పిల్లలు లేకపోవడంతో భర్త, అత్తమామలు నిత్యం వేధిస్తుండేవారు. ఆదివారం ఉదయం భార్యాభర్తల మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగింది. అనంతరం భర్త పనికి వెళ్లిపోగా.. తీవ్ర మనస్తాపానికి గురైన సమీర ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త భోజనానికి వచ్చి చూసేసరికి తలుపులు ఎంతకు తీయకపోవడంతో గ్రామస్థులు తలుపు పగలగొట్టారు. అప్పటికే ఆమె మృతిచెందింది. సమీర కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఖాదర్‌బాషా తెలిపారు.

ఆదిత్యుని ఆలయ ఈవోగా భద్రాద్రి



అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవస్థానం ఈవోగా వై.భద్రాద్రి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లా కాషాపురం గ్రామంలో గల నెట్టికంటి ఆంజనేయస్వామివారి దేవస్థానం నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న రమేష్‌బాబు డిప్యూటీ కమిషనర్ హోదాలో దేవదాయశాఖ కాకినాడ బదిలీ అయింది. కాగా సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్టు తెలుస్తుంది.

హెడ్ కానిస్టేబుల్ సేవలకు గుర్తింపు


హెచ్‌సీకి ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న ఎస్పీ

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తెలుకల రామారావు చేస్తున్న సేవలకు ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి గుర్తించారు. మానవత దృక్పథంతో ఆపదలో ఉన్న ఎంతోమందికి సహాయం అందజేస్తున్నారు. ఆదేవిధంగా పరిసర ప్రాంతాల్లో అనాథలు ఎవరైనా చనిపోతే అన్నీ తానై వారికి అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న రామారావును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామారావును తోటి ఉద్యోగులు, గ్రామస్థులు అభినందించారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సంఘం అధ్యక్షుడిగా దిలీప్‌కుమార్

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సంఘం అధ్యక్షుడిగా గువ్వాడ దిలీప్ కుమార్‌ని ఎన్నుకున్నట్టు గౌరవాధ్యక్షులు బర్రు తులసీరావు, బాగ మోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షులుగా తునియా మాధవరావు, జుత్తు ధర్మారావు, పి.కిరణ్, ప్రధాన కార్యదర్శిగా దద్ద గిరీష్‌కుమార్, సహాయకార్యదర్శిగా లండ శేఖర్, మహిళాధ్యక్షురాలుగా దీపాల ధనలక్ష్మి, మహిళా ప్రధాన కార్యదర్శిగా దద్ద రుక్మిణమ్మ ఎన్నికయ్యారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస: మహిళా స్వయంశక్తి సంఘాలు పంచ సూత్రాలు అమలులో భాగంగా ముఖ్యమైన రికార్డులు నిర్వహణపై అ ప్రమత్తంగా ఉండాలని వెలుగు జిల్లా గ్రామీణాభివృదిసంస్థ అసిస్టెంట్ మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. ఆదివారం కొర్లకోట, నిమ్మతొర్లేడ గ్రామాల్లో మహిళా సంఘాల పనితీరు, బుక్ కీపింగ్‌ను పరిశీలించి సూచనలు చేశారు.

గురుకుల స్థలం ఆక్రమణకు యత్నం

ఎచ్చెర్ల: ఎస్ఎం పురంలోని ఏపీ గురుకుల పాఠశాలకు చెందిన స్థలాన్ని ఆక్రమించేందుకు ఆదివారం కొంత మంది ప్రయత్నించారు. పాఠశాలకు చెందిన స్థలంలో ఉన్న డొంకను, పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాన్ని చదును చేస్తుండగా.. ఈ విషయాన్ని తెలుసుకున్న ఉపాధ్యాయులు అక్కడికి చేరుకుని వారి ప్రశ్నించారు. గతంలో గురుకుల సొసైటీ పాఠశాల అవసరాల కోసం 14.7 ఎకరాలను కొనుగోలు చేయగా.. ఈ భూమిని ఏ విధంగా ఆక్రమిస్తారని ఉపాధ్యాయులు అడ్డుపడ్డారు. ఇప్పటికే కొంత మంది గురుకుల స్థలాన్ని ఆక్రమించారని.. ఈ విషయాన్ని పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఎలాంటి చర్యలు లేవు. ఇప్పటికైనా ఆక్రమణలు అరికట్టేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.